## క్షీర భవనారాయణస్వామిని దర్శించుకున్న మంత్రి రోజా

నగరి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:



క్షీర భవనారాయణ స్వామి దేవాలయంలో భవనారాయణ స్వామివారిని, శ్రీ చెన్నకేశవ స్వామివారిని, శ్రీ విగాభోగా యోగా స్వామివారిని మంత్రి రోజా దర్శించుకున్నారు. దేవాలయ ప్రధాన అర్చకులు పాలక మండలి సభ్యులు మంత్రి రోజాకి స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం వేదమంత్రాలతో మంత్రికి ఆశీర్వాదించారు. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కోన రఘుపతి, స్థానిక పార్లమెంట్ సభ్యులు నందిగామ సురేష్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## రావణుడిపై శివపార్వతుల చిద్విలాపం

చౌడేపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త



అభీష్టధ మృత్యుం జయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శివపార్వతులు రావణుడిపై ఊరేగారు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. వాహనసేవకు సజ్జనకులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.





## అలనాటి వివాహఘట్టాన్ని తలపించేలా నారాయణగిరి వేదిక

తిరుమల,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:

ఆకాశరాజు కుమార్తె పద్మావతిదేవిని వివాహమాడిన తొలిరోజులు గుర్తుచేసుకుంటూ టిటిడి శ్రీనివాసుడి పరిణయోత్సవాలకు నారాయణగిరి ఉద్యానవనాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. కల్యాణవేదిక హిందూ సాంప్రదాయాలు ఉట్టిపడేలా స్వామివారికి వెదురు, తాటి,టెంకాయ ఆకులతో చేసిన ప్రతిమలను ,కలశాలను సంప్రదాయంగా అలంకరించారు. శనివారం సాయంత్రం మంగళవాయిద్యాలఛత్రచామర నడుమ గజవాహనంపై స్వామివారిని, పల్లకీలో అమ్మవార్లను కొలువుదీర్చి వివాహమహోత్సవ వేదిక వద్దకు చేర్చారు. ఇక్కడ ఆలయ అధికారులు మరోవైపు అర్చకులు ఈ తంతును జరిపించారు.

### కాణిపాకంలో

## మహాప్రాకారం నిర్మాణం

**-అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లింపు**

**-8 వేల మందికి నిత్యాన్నదానం పెంపు -పాలకమండలి తీర్మానం**

కాణిపాకం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:



విలేకరులతో మాట్లాడుతున్న ఆలయ ఛైర్మన్, ఈఓలు

శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చేందుకు 50 కోట్లు రూపాయల వ్యయ అంచనాలతో మహాప్రాకారం నిర్మించాలని పాలకమండలి తీర్మానించినట్లు ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు. శనివారం పాలకమండలి ఛైర్మన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో పాలకమండలి సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధికి సంభందించి పలు అంశాలపై పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించి కీలక నిర్ణయాలను తీసుకున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు సమావేశం అనంతరం విలేకరులకు వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా దేవాదాయశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాబుల సూచనల మేరకు మూడు ఆలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చేందుకు మహాప్రాకారం నిర్మించాలని తీర్మానించినట్లు తెలిపారు. అలాగే 2023-24 సంవత్సరంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కనీసం వేతనం అమలు చేస్తూ జీతాలు పెంచుతూ పాలకమండలిలో నిర్ణయం తీసుకున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు. క్షురకులకు ప్రస్తుతం 8 వేల రూపాయలు వేతనాలు చెల్లిస్తుండగా ఈమొత్తాన్ని 20 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. అయితే దేవస్థానం సామూహిక కళ్యాణ మండపంలో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి ప్రతిరోజూ 8 వేల మంది వరకు భక్తులకు ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు అల్పాహారం, అన్న ప్రసాద వితరణ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు గోవర్ధన్, గోపి, మారుతీశ్వరరావు, ప్రతిమ, కొండయ్య, రామసుబ్బమ్మ,సుబ్బలక్ష్మమ్మ, సోమశేఖర్ గురుకుల్, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ,సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కోదండపాణి, శ్రీనివాస్ రవి, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక అనుభూతి

**గవర్నర్ హోదాలో తొలిసారి గోవిందుని సేవలో జస్టిస్ నజీర్**



తిరుమల,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:

రాష్ట్రగవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ అబ్దుల్‌నజీర్‌శనివారం ఉదయం తొలిసారిగా కుటుంబసమేతంగా దేవదేవుని దర్శించుకున్నారు. వెంకన్న సేవలో పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. ఆలయం వద్ద టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## భూసేకరణ ప్రక్రియ త్వరితంగా పూర్తి

### - కలెక్టర్ సగిలి షన్మోహన్



చిత్తూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:

జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించే జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి ఇంకను పెండింగ్‌లో వున్న భూసేకరణ ప్రక్రియను త్వరితంగా పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశమందిరంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ శనివారం జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూసేకరణలో భాగంగా జాతీయ రహదారులు, ఎపిఎస్‌పిడిసిఎల్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ల ఏర్పాటు తదితర శాఖలకు సంబంధించి భూసేకరణ అంశాలపై జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ రాజశేఖర్‌లతో కలిసి సంబంధిత అధికారులు, తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్ళడానికి రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా వున్న చిత్తూరు జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ఎక్కువ అవకాశాలు వున్నాయన్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో వున్న భూసేకరణ ప్రక్రియను త్వరితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఎపిఎస్‌పిడిసిఎల్ జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు భూమి కేటాయించాల్సివుందని, తహసిల్దార్లు ఈ ప్రక్రియను పూర్తి చేసి ట్రాన్స్‌కో అధికారులకు అప్పగించాలన్నారు. సమీక్షలో చిత్తూరు, కుప్పం, నగరి ఆర్డీఓలు డాక్టర్ రేణుక, శివయ్య, సుజనలు, ఎన్‌హెచ్ డిప్యూటీ మేనేజర్ లహీర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిటెండెంట్ ఆయిషాబేగం, ఎపిఐఐసి జెడ్ఎం సోని, ట్రాన్స్‌కో ఇఇ శ్రీహరి, సెజ్ సిఇ జోగేంద్ర ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### పండగ వాతావరణంలో...

## ప్రభుత్వ బడులు ప్రారంభించాలి : కలెక్టర్

తిరుపతిరూరల్, ఏప్రిల్29 ప్రభాతవార్త:



ప్రభుత్వ బడులలో పూర్తి సౌకర్యాలు కల్పించి, జగనన్న విద్యాకానుకను అందించి జూన్ 12న పండగ వాతావరణంలో ప్రభుత్వ బడులు పున:ప్రారంభానికి సిద్దంగా ఉంచాలని జిల్లా విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరములో బడులలో అన్ని వసతులు కలిగి ఉండాలని, ప్రారంభం నాటికి పిల్లలకు విద్యా కానుక అందించే చర్యలు చేపట్టాలని ప్రత్యేక సూచనలు ఇచ్చారు. విద్యా కానుక కిట్లు త్వరగానే మండల స్టాక్ పాయింట్స్‌కు చేరతాయని, వాటి నాణ్యత పరిశీలన పూర్తి చేయాలన్నారు. గత సంవత్సరం 10వ తరగతి పరీక్షలు తప్పిన విద్యార్థులు 637 మంది ఉన్నారని, వారిని తప్పనిసరిగా గుర్తించి టీచర్లకు సబ్జెక్ట్ బోధనకు అనుసంధానం చేయాలని, సమ్మతి చూపనివారిని ఖాళీగా ఉంచరాదని, యువ వయస్సులో వున్న వారిని తప్పనిసరి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా నచ్చిన రంగంలో సాంకేతిక శిక్షణ ఇప్పించి, శిక్షణ పూర్తి కాగానే ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు.

## ఆటోమొబైల్స్ దుకాణానికి నిప్పంటించిన దుండగులు

### -సుమారు 20లక్షల ఆస్తి నష్టం



పలమనేరు,ఏప్రిల్ 29,ప్రభాతవార్త:

పట్టణంలోని ఓ ఆటోమొబైల్ దుకాణానికి గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది.స్థానికుల కథనం మేరకు..పట్టణంలోని మర్కస్ కాంప్లక్స్‌లోని ఓ ఆటోమొబైల్ దుకాణంలో శుక్రవారం రాత్రి దుకాణం వద్ద ఓ కారులో కొందరు దుండగులు వచ్చి దుకాణానికి నిప్పంటించి పరిపోవడం స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.అయితే అప్పటికే దుకాణంలోని సుమారు రూ.20లక్షల విలువైన పరికరాలు,టైర్లు,రూ.3లక్షలు మంటలలో దగ్ధమైంది.దీనిపై దుకాణం నిర్వహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సమీపంలోని సిసి కెమరాల ఆధారంగా కేసు ధర్యాప్తు చేస్తున్నారు.

## పారిశుధ్య కార్మికులతో చెవిరెడ్డి చర్చలు సఫలం



తిరుమల,ఏప్రిల్ 29ప్రభాతవార్తప్రతినిధి:

న్యాయమైన డిమాండ్లు సాధనకోసం నిరవధిక సమ్మెలో ఉన్న సులభ్ కాంట్రాక్టు కార్మికులు సమ్మె విరమించి విధుల్లోకి రావాలని చంద్రగిరి ఎమ్మెల్యే,తుడ ఛైర్మన్, టిటిడి బోర్డుసభ్యుడు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామని, తిరుమల ప్రాధాన్యత పవిత్రతను కాపాడేలా విధులకు హాజరుకావాలని చెప్పారు. సిఐటియు,ఏఐటియుసి నాయకులతో కలసి డాక్టర్ చెవిరెడ్డి కార్మికులతో నేరుగా మాట్లాడారు. కార్మికులకు ఇబ్బంది పెట్టేలా ఉన్న సులభ్ సంస్థను తొలగించి కొత్త కాంట్రాక్టర్ల వద్ద పాతవారినందరికీ విధులు కేటాయిస్తామని, ఇఎస్ఐ,పిఎఫ్, లడ్డూకార్డు, వారానికి ఒకరోజు సెలవు తదితర సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు.

## క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి



తిరుపతి క్రైం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

ఐపిఎల్ టి 20 క్రికెట్ మ్యాచ్లను ఆసరా తీసుకుని, అమాయక ప్రజలను, యువకులను టార్గెట్‌గా చేసుకుని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, తిరుపతి నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెంచడం జరిగిందని జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి హెచ్చరించారు. అమాయకుల అలవాట్లను ఆసరాగా చేసుకుని ఎవరైన డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, నిర్వహించినా ఉపేక్షించబోమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ జూద చట్టం కేసులు నమోదు చేయడమే కాక కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అవసరం మేరకు సస్పెక్ట్ ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఒకటి గమనించాలి ఊరికే వచ్చే నగదు వెనుక అనేక నష్టాలు దాగి ఉంటాయని యువత గుర్తు ఎరగాలని, అవసరం ఆర్భాటాలకు పోయి తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేయవద్దు. యువత అనవసరంగా కేసుల్లో ఇరుక్కొని జీవితాలను దుర్భరం చేసుకోవద్దని, యువత తమ తల్లిదండ్రుల కోసం ఉన్నతంగా బ్రతకాలే గానీ బెట్టింగ్ రాయుళ్ళ వల నుండి బయటపడందని విజ్ఞప్తి చేసారు.

## లక్ష్మీపురంలో ఉద్రిక్తత.. వైకాపా.. తెదేపా శ్రేణుల ఘర్షణ

**- టు వీలర్ దగ్ధం.. గ్రామంలో పోలీసు పహారా !!**



కుప్పంరూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి లక్ష్మీపురంలో జాతర సందర్భంగా అధికార వైకాపా, ప్రతిపక్ష తెదేపా శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడగా అర్బన్ సిఐ శ్రీధర్, రూరల్ సిఐ రియాజ్ అహ్మద్‌ల పర్యవేక్షణలో గ్రామంలో పోలీసు పహారా ఏర్పాటుచేశారు. శుక్రవారం రాత్రి గ్రామంలో జాతర సందర్భంగా కౌన్సిలర్ మణి, తెదేపా యూత్ లీడర్ బాలు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని స్థానికులు తెలిపారు. అయితే ఉదయం కుప్పం హెచ్‌పి రోడ్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తెదేపాకు చెందిన బాలు యొక్క ద్విచక్ర వాహనాలను వైకాపా శ్రేణులు నిప్పంటించి దగ్ధం చేశాయని దేశం నేతలు పేర్కొన్నారు. మరో పక్క బాలు వర్గీయులు కళ్ళల్లో కారం సైతం చల్లి దాడులకు దిగారని వైకాపా శ్రేణులు పేర్కొన్నాయి. పోలీసులు చెదరగొట్టారు. ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

### కుప్పంలో వైకాపా గూండాల దాడులు అరికట్టాలి

**డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డికి చంద్రబాబు లేఖ !!**

కుప్పం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో తెదేపా శ్రేణులపై వైకాపా గూండాల దాడులను అరికట్టాలని ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు శనివారం రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డికి లేఖ రాశారు. కుప్పంలో వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చాక హింసాత్మక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని కొంతమంది పోలీసులు వైకాపా గూండాలకు మద్దతు పలుకుతూ తెదేపా శ్రేణులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని అలాగే రౌడీషీట్లు తెరుస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంకు విఘాతం కలిగిస్తున్న పోలీసులను విధులనుంచి తొలగించడంతో పాటు తెదేపా శ్రేణులపై నమోదైన తప్పుడు కేసులను రద్దు చేయాలని లేఖలో పేర్కొన్నారు.

## శనీశ్వరునికి షోడషాభిషేకాలు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ముక్కోటి దేవతలు వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తూ భక్తుల నుంచి సేవలందుకుంటున్నారు. శనివారం ఆలయంలో శనీశ్వరునికి షోడషాభిషేకాలు నిర్వహించారు. ఇటు శనీశ్వరస్వామి అటు అభయవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో అడుగుపెట్టినప్పటి నుంచి భక్తులు తన్మయత్వంతో సంతృప్తి చెందుతుంటారు.ఈ నేపథ్యంలో ఆలయంలోని ఒక్కొక్క దేవునికి ఒక్కొక్క రోజు ఒక్కొక్క అభిషేకం నిర్వహించటం ఆనవాయితిగా మారింది.

### భక్తుల సంబరాలు

ఈ నేపథ్యంలో శనివారం స్వామి వారి మూలవిరాట్టుకు దర్శనం చేసుకొని రాగా బయట అభయవెంకటేశ్వస్వామి దర్శనమిస్తారు. సాధారణంగా వెంకటేశ్వరస్వామి విగ్రహానికి కుడి చేయి కింద చూపుతుంటుంది.అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన నిలువెత్తు విగ్రహం అభయం ఇచ్చినట్లు ఉంటుంది.ఇక్కడ శనివారం భక్తులు విశేషసంఖ్యలో హాజరౌతున్నారు. స్వామి నుంచి వరాలు పొందుతున్నారు.ఈ నేపథ్యంలో శనివారం వెంకటేశ్వరస్వామికి ప్రత్యేకాలంకరాలు జరిపారు. కాగా పక్కనే ఉన్న శనీశ్వరస్వామి ఆలయంవద్ద స్వామికిషోఢషాభిషేకాలు నిర్వహించారు.ఈ అభిషేకాలకు భక్తులు విశేష సంఖ్యలో హాజరై అభిషేకాలు జరిపించుకున్నారు.అధికారులు అందించినసమాచారం మేరకు రూ.500ల రాహుకేతుదోష నివారణ పూజలు 2401,రూ.750లరాహుకేతుదోష నివారణపూజలు 1084, రూ.2500 టిక్కెట్లు 224, రూ.5వేల టిక్కెట్లు ద్వారా 72 మంది పూజలు జరిపించుకున్నట్లు పేర్కొన్నారు. మొత్తానికి సుమారు 5వేల పూజలుజరిగాయి. శనీశ్వర అభిషేకాలు 96 జరిగాయి. కళ్యాణం రెండు,అలాగే హోమాలు కూడాగణనీయంగా జరిగినట్లు పేర్కొన్నారు.

## దేవుడి వృక్షాలకే దిక్కు లేదు..

**నిద్రావస్థలో దేవాదాయశాఖ**



ఆలయం పక్కన అక్రమార్కులు కూల్చేసిన భారీ వృక్షం,

గంగవరం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :

కోనేటిరాయునికి అత్యంత ప్రీతికరమైన శనివారం రోజున ఆలయానికి ఆహ్లాదాన్ని కలిగించే భారీ వృక్షాలను తెగనరికిన సంఘటన ఇది.. దేవుడి వృక్షాలకే దిక్కు లేకపోవడంతో ఇక దేవుని ఆస్తులకు రక్షణ ఎక్కడ ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే.. సాక్షాత్తు తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలో కీలపట్లలో వెలసిన శ్రీకోనేటిరాయస్వామి ఆలయ వృక్షాలకే రక్షణ కరువై ఆలయ వృక్షాలను అక్రమార్కులు కూల్చివేసిన ఉదంతం శనివారం మండలంలోని కీలపట్లలో చోటు చేసుకుంది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరంపర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటుతూ వాటి సంరక్షణ అధికారులు చూసుకోవాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్న మండలంలోని కొందరు అక్రమ అధికారులు అక్రమార్కులతో కుమ్మకై ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు గారుస్తున్నారు.సందిట్లో సడేమియా అన్నట్లుగా కొందరి నాయకుల సహకారంతో ఏవో సాకులు చూపుతూ అధికారులకు ముడుపులు చెల్లించి శ్రీ కోనేటిరాయుని ఆలయం చుట్టు ఆహ్లాదకరంగా ఉన్న ఏళ్ళనాటి దాదాపు 10 భారీ వృక్షాలను పట్టపగలే అక్రమార్కుల గొడ్డలి వేటుకు నేల కొరిగాయి.నేల కొరిగిన వృక్షాలను ముక్కలు ముక్కలుగా నరికి లారీల ద్వారా రవాణాకు సిద్ధం చేస్తున్నారు.విషయం తెలుసుకున్న పలమనేరు అటవీశాఖ అధికారి నయిమ్‌అలీ ఆలయ వృక్షాలు నరికివేతపై తాము ఎలాంటి అనుమతి ఇవ్వలేదని సమాచారం తెలుసుకున్న వెంటనే లారీని, దుంగలను స్వాధీనం చేసుకొన్నామన్నారు.ఈ విషయమై ఆలయ పర్యవేక్షణ అధికారి గజేంద్రను ప్రభాతవార్త వివరణ కోరగా తాము ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల పర్యవేక్షణలో ఉండగా వృక్షాలను కూల్చివేసిన ఘటన తమకు తెలియదని, ప్రభాతవార్త వృక్షాలను నరికిన పోటో లను తీయడంతో తనకు రూ.55000 ఇచ్చారని సమాధానం ఇవ్వడం కొసమెరుపు.

## తొట్టంబేడులో చంద్రమ్మను పరామర్శించిన బృందమ్మ



**తొట్టంబేడు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త** మండలంలోని తొట్టంబేడు పంచాయతీలో తెలుగుదేశంపార్టీ సీనియర్ బిసి సెల్ నాయకులు వెంకటేష్ సతీమణి పిహెచ్‌సి మాజీ కమిటీ సభ్యురాలు చంద్రమ్మ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి స్విమ్స్ లో చికిత్స పొందుతూ డిశ్చార్జి అయ్యి స్వగ్రామానికి చేరుకున్నారు. ఈసందర్భంగా దివంగత నేత మాజీ మంత్రి బొజ్జలగోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జలబృందమ్మ వారి ఇంటికి వెళ్ళి పరామర్శించడంతో పాటు పండ్లు అందించి ఆమె సత్వరం కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, రేణుకమ్మ, తిరుపతి పార్లమెంటు బిసి సెల్ నాయకులు భాస్కర్, బాలసుబ్రమణ్యం, ముని ప్రసాద్, మణి, సుబ్బయ్య, రాజ్‌కమల్, నాగేశ్వరరావు, ధనలక్ష్మమ్మ, కృష్ణవేణి, వెంకటేశమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేయండి!

–జనసేన జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** రానున్న 2024 ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకమని,కాబట్టి బూత్ స్థాయి నుండి కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త తమవంతు కృషి చేయాలని జనసేన పిఏసి సభ్యుడు,ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ పిలుపునిచ్చారు.శనివారం పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం,దేవదొడ్డి,ఎం.కొత్తూరులో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం,అలాగే జనసేన జిల్లా కార్యదర్శి పసులేటి దిలీప్,మండల అధ్యక్షుడు చైతన్యల ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా॥హరిప్రసాద్ మొదటగా పార్టీ జెండా ఆవిష్కరించారు.అనంతరం వైసిపి పార్టీ నుండి జనసేనలో చేరడానికి వచ్చిన 50 మంది నాయకులకు పార్టీ కండువా వేసి జనసేనలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన,జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు,5 మండలాల ఇన్‌ఛార్జ్‌లు,జిడి.నెల్లూరు ఇన్‌ఛార్జ్ యుగంధర్,ప్రధాన కార్యదర్శి తులసీప్రసాద్,కార్యదర్శులు ఆనంద్,బాటసారి,రామ్మూర్తి,వేణు,ఐటి కో–ఆర్డినేటర్ భరత్,తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు 65 పెట్రోల్ స్కూటర్స్ ఉచితంగా పంపిణి

– కలెక్టర్ వెంకటరమణారెడ్డి – విభిన్న ప్రతిభావంతుల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ: చైర్మెన్ ముంతాజ్ పఠాన్



**తిరుపతిరూరల్, ఏప్రిల్29 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు 65 పెట్రోల్ స్కూటర్స్‌ను ఉచితంగా అందజేసినట్లు కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో వయోజనుల శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు స్కూటర్స్‌ను అందజేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రూ.1,20,000 రుపాయాల విలువ కలిగిన స్కూటర్స్‌ను విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా అందజేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం, సౌకర్యార్థం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలోని 18 నుండి 45 సంవత్సరాల లోపు అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు పిజీ చేసే విద్యార్థులకు, స్వయం ఉపాధి చేసుకునేవారికి ప్రాధాన్యత ఇచ్చి 56మందికి రూ.78లక్షలు చేసే స్కూటర్స్‌ను ఉచితంగా పంపిణి చేసినట్లు ప్రతిభాంతుల, వయోజనుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మెన్ కుమారి ముంతాజ్ పఠాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో శ్రీనివాసరావు, సంక్షేమశాఖ అధికారులు శ్రీనివాస్, సూపరింటెండెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సువాసిని పూజ

**పుత్తూరురూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం సువాసిని పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో 108 మంది ముత్తైదులచే సుహాసిని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కలుస్థాపన ప్రత్యేక హోమాలు నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు పూజలు చేశారు. నేడు ఆదివారం ఆలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా ఉదయం అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు ఉంటాయని అనంతరం వారాహిని హోమం ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం కూడా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## అంతర్జాతీయ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

**పుత్తూరురూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణం స్వామి వీధి శ్రీచైతన్య పాఠశాల పుత్తూరు–1 విద్యార్థులు ఐఎన్‌టిఎస్‌వో ఒలంపియాడ్‌పరీక్షలో ఘన విజయం సాధించారు. మొదటి బహుమతి ఒకరు, రెండో బహుమతి ఇద్దరు,నాలుగో బహుమతి ఇద్దరు, 5వ బహుమతి ముగ్గురు, స్పెషల్ ప్రైసెస్ 13 మంది, కన్సోలేషన్ ప్రైసెస్ 34 మంది, గోల్డ్‌మెడల్స్ 111 మంది, మెరిట్ సర్టిఫికెట్ 247 మంది గెలుపొందారు. అన్ని విభాగాల్లో ఉత్తీర్ణత సాధించిన వారు మొత్తం 405 మంది విద్యార్థులు, ఈ ఘన విజయం సాధించిన విద్యార్థులనుద్దేశించి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ శరవన్ మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణత కావడం ఆనందదాయకమని ప్రశంస జల్లుకురిపించారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం డా. శ్రీనివాసులు విద్యార్థులనుద్దేశించి ఏ పోటీ పరీక్ష అయినా విజయం మన విద్యార్థుల తరువాతే అని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్ బాలాజీ విద్యార్థులకు బంగారు పతకం అందజేశారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ విద్యార్థులకు కన్సోలేషన్ ప్రైస్ అందజేశారు. డీన్ మోహన్ విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో గాయత్రి, తదితర ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశపరీక్షలు

**సత్యవేడు, ఏప్రెల్ 29, ప్రభాతవార్త:** సత్యవేడు ప్రభుత్వ బాలుర పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు ఛీఫ్‌గా ప్రధానోపాధ్యాయుడు వేంకటేశ్వర్లు వ్యహరించగా, మండల విద్యాశాఖ అధికారి రవి, తహసిల్దార్ శ్రీదేవి పర్యవేక్షణలో ఐదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు పరీక్షను రాశారు. అయితే 95మందివిద్యార్థులుపరీక్షకుహాజరుకావాల్సి ఉండగా84మంది మాత్రమే హాజరయ్యారని వారు తెలిపారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిన వస్తు సామగ్రి

**చంద్రగిరి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:**



స్థానిక శ్రీనివాస వీధిలో శనివారం విద్యుత్ షార్ట సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తు సామగ్రిని ఆహుతి చేశాయి. ఆర్టీసిలో రిటైర్డ్ అయిన తోట శ్రీరాములు స్థానికంగా ఓ ఆలయంలో పూజారిగా వుంటున్నారు. ఆయన ఇంట్లో లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతో ఇంట్లో మంటలు వ్యాపించి వస్తు సామగ్రి మంటల్లో కాలిన వాసన రావడంతో పొరిగింటి వారు సమాచారం ఇచ్చారు. అదేవిధంగా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడం సరఫరా నిలిపివేశారు. తిరుపతి నుండి ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోవడంతో బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తహశీల్దార్ శిరీషా ఆదేశాల మేరకు విఆర్‌ఓ భాస్కర్ సంఘటనా స్థలికి చేరుకుని బాధితుడికి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని వంట పాత్రలు, ఫ్యాన్లు, ఫ్రిడ్జి, సోఫా, దుస్తులు మంటల్లో కాలిపోయినట్లు గుర్తించారు. బాధితుడికి తగిన సాయం అందించడానికి చర్యలు తీసుకుంటామని విఆర్‌ఓ అన్నారు.

## ఆలయ సిబ్బందినిజాయితి: మని పర్సు అప్పగింత

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 29 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయానికి దూర ప్రాంతాలనుంచి వవేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. శనివారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన సూరుగారి అనంద్‌రెడ్డి కుటుంబసభ్యులతో వచ్చారు.వారు స్వామి అమ్మవార్లదర్శనానికి వెళ్ళి వచ్చిన వారుతిరుగు పయనమయ్యారు.ఈ పర్సును సిబ్బందికి దొరికింది.దానిని ఆలయ సిబ్బంది,హోంగార్డులు,సెక్యూరిటి,ఎస్‌పిఎఫ్ సిబ్బంది కలసి దానిని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందించారు. ఆయన మైక్‌సెట్‌లో అనౌన్స్ చేయించారు. దాంతో ఆనందరెడ్డిరాగా వారు అందించిన వివరాలతో భక్తుడికి అప్పగించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగభూషణం,శ్రీనివాసులు,మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం అందుబాటులో ఉంటా! సమస్యలు పరిష్కరిస్తా!

ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధనరెడ్డి



**శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా మీరు ఊహించని రీతిలో మెజారిటితో గెలిపించారు. మీ సేవే తనకు పరమావధి. ఏ సమయంలో మీకు సమస్య వచ్చినా నాకు ఫోన్ చేయండి.అంటూ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు. శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూ రు,పెనుబాక గ్రామంలో శనివారం ఆయన ఇంటింటికి మీ ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిరుపేదల సంక్షేమానికి చేపట్టిన పథకాల ఫలాలు అందించాల్సిన బాధ్యత అధికారులదే అని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు.శుక్రవారం మండలం అరవకొత్తూరు సచివాలయ పరిధిలో ఆయన 'జగన్ననే మా నమ్మకం' పథకంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కార్యక్రమాలను మప్పెటి సుబ్రమణ్యం రెడ్డి సారధ్యంలో పూల వర్షం కురిపించారు. కార్యక్రమాలను గ్రామానికి చెందిన వైకాపానాయకులు మండలానికి చెందిన ఇతర వైకాపా నాయకులు, మండలాధికారులు, సచివాలయం సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాదులు

**తొట్టంబేడు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాదులని కొణతనేరి సర్పంచ్ గాలిశ్రీనివాసబాలాజీ అన్నారు. శనివారం గుర్రప్పనాయుడుకండ్రిగ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానప్రసూనాంబ ఆధ్వర్యంలో సరస్వతీపూజను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానప్రసూనాంబతో పాటు ఉపాధ్యాయుడు కన్నలివిజయకుమార్‌లు స్వాగతం పలికారు. ఈసందర్భంగా సర్పంచ్ సరస్వతీదేవి చిత్రపటానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ ఏవిద్యార్థికైనా ప్రాథమికవిద్యే వారి భవిష్యత్తును నిర్దేశిస్తుందని ఇక్కడ వేసి పునాదులే వారి బంగారు భవిష్యత్తును నిర్దేశిస్తుందన్నారు. విద్యార్థులందరు సంప్రదాయదుస్తులు ధరించి సరస్వతీదేవిపూజలో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్రసూనాంబ, ఉపాధ్యాయులు కన్నలవిజయకుమార్, ఎస్‌ఎంసి ఛైర్మన్ జె.సుబ్రమణ్యం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్రీస్తు మార్గం శాంతి మయం - ఎమ్మెల్యే



**రేణిగుంట,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** అందరూ ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరిస్తే ప్రపంచం శాంతి మయంగా మారుతుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండల శివారు జెరూసలీం అపోస్టలిక్ చర్చిలో గత మూడు రోజులుగా జరుగుతున్న 31వ ఉపవాస ప్రార్థనలు శనివారం ముగిశాయి. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చర్చి నిర్వాహకులు, పాస్టర్ చంద్రన్ డేవిడ్ తదితరులు ఎమ్మెల్యేలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల మతాలకతీతంగా అందరూ సోదర భావంతో కలసి మెలసి ఉండాలన్నారు. అదే క్రీస్తూ మార్గంగా అభివర్ణించారు. అందరూ ఆ మార్గంలో పయనిస్తే ప్రపంచం శాంతి మయంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు చర్చి నిర్వాహకులు, క్రీస్తు ప్రేమికులు, సర్పంచ్ నాగేషం, తిమోతి, వ్యాసర లారెన్స్, పీటర్, ఏసుపాదం, జోసఫ్, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకే అంకితం - ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**రేణిగుంట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని తాను, తన కుటుంబం ప్రజాసేవకు అంకితమయ్యామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మరో మారు నొక్కి వక్కాణించారు. రేణిగుంట ముస్లిం మైనారిటీ సోదరులు శనివారం ఎమ్మెల్యేను కలసి రేణిగుంట ఈద్గా సమీపంలో షాపింగ్ కాంప్లెక్స్, మసీదు, మదరసా నిర్మాణాల గురించి వివరించారు. ప్రభుత్వం ద్వారా కోటి రూపాయలు నిధులు మంజూరు చేయించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎప్పుడు ప్రజల పక్షమని ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మైనారిటీ నేతల అభ్యర్థనపై సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో ఈద్గా కమిటీ చైర్మన్ అమానుల్లా, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖాదర్, రేణిగుంట సర్పంచ్ నాగేషం, పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, ముత్తవల్లీలు షఫీ ఉల్లా, వలిసాహెబ్, రహమతుల్లా, రఫీ ఉల్లా, సెమివుల్లా, యానస్, జాఫర్ జిలాని, సికిందర్, పలువురు మైనారిటీ నేతలు ఉన్నారు

## ఎంఎస్ఆర్‌కు ఘన సత్కారం



**రేణిగుంట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** తారకరామానగర్‌కు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చొరవ, పవిత్రరెడ్డి ప్రమేయంలో ఐదులక్షల రూపాయలు నిధులు ఖర్చు చేసి రెండు బోర్లు వేయించిన తారక రామానగర్‌వైసీపీ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డిని(ఎంఎస్ఆర్) వార్డు మెంబరు షాహిదా భర్తధర్మానాయుడు తన పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఆర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పవిత్రరెడ్డి ఆదేశాల మేరకు 14వ వార్డులో ఐదు లక్షల నిధులతో రెండు బోర్లు వేయించి, వాటికి మోటార్లు ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన పైపులైన్లు వేస్తున్నామన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో మధుసూదన్‌రెడ్డి లేదా పవిత్రరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నేతలు ఫోటో శీను, రాజేష్, కాలేశా, తహసీన, జిలాని, లోకేష్, చైత్ర, కవిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల నివారణలో టీకాలదే ప్రాధాన్యత

ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి



**పుత్తూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** కోవిడ్, మశూచి, పోలియో వంటి ప్రమాదకర వ్యాధులను మానవ జాతి ఎదుర్కోవడంలో టీకాలు సమర్ధమైన పాత్ర పోషించాయని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కాలేజీలో ఈ నెల 24 నుంచి వారం రోజుల పాటు టీకా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీకాలు కనుగొని ఎడ్వర్డ్ జెన్నర్, లూయిస్ పాశ్చర్, రాబర్ట్ కోచ్ వంటి శాస్త్రవేత్తలు మానవాళిని రక్షించారని కొనియాడారు. బిఎస్సీ బిజెడ్‌సి విభాగం విద్యార్థులు ఇతర గ్రూపు విద్యార్థులకు, గ్రామస్తులకు టీకాల ప్రాధాన్యత, రకాలు, ఉత్పత్తి, ప్రయోగ విధానం, ఆవశ్యకతలను వివరించారు. అనంతరం ఇమ్యూనైజేషన్ అంశంపై చర్చా గోష్టి, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. జంతు శాస్త్ర విభాగ ఇన్‌ఛార్జ్ డాక్టర్ శ్యాంసన్‌రాజు, ఇంకాఅధ్యాపకులు డాక్టర్ స్వాతి, డాక్టర్ వెంకటకృష్ణయ్య పలువురు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## శివాలయం స్థల ఆక్రమణలు కూల్చివేత



**పుత్తూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీ కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయం చుట్టూ దేవస్థానం స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను శనివారం ఆలయ అధికారులు కూల్చివేశారు. ఏళ్ల తరబడి ఆక్రమణలో వున్న స్థలాల విషయమై 2012వ సంవత్సరంలో ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో దేవస్థానం అధికారులు కేసు వేయగా 2019లో ఆక్రమణలు తొలగించి, స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని తీర్పు చెప్పింది. ఆ మేరకు 2019లో 30 రోజుల్లోగా ఆలయ స్థలాలు ఖాళీ చేయాలని ఆక్రమణదారులకు నోటీసులిచ్చామని దాంతో కొందరు స్వచ్ఛందంగా ఖాళీ చేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. మిగిలిన వారిని పోలీస్, రెవెన్యూ శాఖల సిబ్బంది సహకారంలో శనివారం ఖాళీ చేయించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## వ్యవసాయ మోటార్లకు కరెంట్ ఇవ్వండి



**విజయపురం, ఏప్రిల్ 29 ప్రభాతవార్త :** తమ వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేయాలని మండలంలోని రైతులు ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నారు. మండలంలో వారం రోజుల క్రితం గాలి వాన భీభత్సానికి 12 ట్రాన్స్‌ఫార్మర్లు, 42 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాటిలో 8 ట్రాన్స్‌ఫార్మర్లు, 28 విద్యుత్ స్తంభాలను అధికారులు మరమ్మతు చేశారు. ఇంకా కొన్ని మిగిలి వుండడం వల్ల మండలంలో పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పోతురాజుల కండ్రిగ, గాండ్ల కండ్రిగ, వరదరాజుల కండ్రిగ, మంగళం, ఇల్లత్తూరులోని కొన్ని ప్రాంతాల్లో వారం రోజుల నుంచి వ్యవసాయానికి విద్యుత్ అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నుంచి విధులు నిర్వహించే సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కూడా కరెంట్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## వైకాపా కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగనన్న ముగింపు



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 29 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని వైకాపా కార్యాలయంలో శనివారం 'జగనన్నే మా భవిష్యత్తు–మానమ్మకం నువ్వే జగనన్న'ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా బియ్యపు మధుసూధనరెడ్డి తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి హాజరయ్యారు. ఉదయం వైయస్ఆర్ సర్కిల్ నుంచి మోటార్‌సైకిల్ ర్యాలి నిర్వహించారు.కాగా పార్టీ కార్యాలయంలో సంబరాలను జరుపుకున్నారు.

**కేక్ కట్ చేసి సంబరాలు:** శ్రీకాళహస్తి వైకాపా కార్యాలయంలో శనివారం సంబరాలు జరుపుకున్నారు. పార్టీ కార్యాలయంలో కేక్‌కటింగ్ కార్యక్రమాలను ఏర్పాటుచేసారు. కేక్‌ను బియ్యపుఆకర్షరెడ్డి కట్ చేయగా ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తినిపించారు.ఈ కార్యక్రమాల్లో వారితో పాటుధర్మకర్తల మండలి సభ్యులు బుల్లెట్‌శ్యామ్ మున్నారాయల్, పసల సుమతి, చింతామణి పాండు,నాని, వెంకీ,రేణిగుంట సర్పంచ్ నగేష్, కందాటి ఈశ్వర్‌రెడ్డి, ప్రభాకర్,గోరా,ఫజల్, సాగిరాబీ, సునీతసింగ్, షర్మిల,ఇందిరా, కొల్లూరు హరినాయుడు, కొన్నలి రమేష్, గోపి గౌడ్, దాము,ఖాదర్ బాషా,శంకర్, అంకయ్య, మురళీయాదవ్, యుగంధర్, సుబ్బరాయుడు, జగదీశ్వరయ్య, షబ్బీర్ అబ్బు, సుధాకర్, పసల కృష్ణయ్య, బాల, బావాజి,అట్లా రమేష్, పోలీ గుణ,పాండు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవ ఏర్పాట్లును పరిశీలించిన చైర్మెన్



**శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లును శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధికారులతో కలసి పరిశీలించారు. బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి మే 10 వరకు జరుగుతాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాల్లో ఉత్సవాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజూ ఉత్సవాలను క్రమశిక్షణగా,సమయ పాలనతో నిర్వహించాలని సూచించారు. ఇక వేసవి కాలం కావటంతో ప్రతి రోజూ మంచినీటిసరఫరాను అందించాలని సూచించారు.ఆదివారం ఆలయంలో అంకురార్పణతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చైర్మెన్ శ్రీనివాసులు వివరించారు. చిన్న ఆలయాల నిర్వాహకులు లక్ష్మయ్యకు పలు సూచనలు చేసారు. పురాతన కాలం నాటి భూదేవి,శ్రీదేవి సమేత చెన్నకేశవ స్వామి విగ్రహాలు అత్యంత అద్భుతంగా ఉందన్నారు.ఈ పరిశీలనల్లో ఎఇఒ లోకేష్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు ఎఇఇ వేణుగోపాల్‌రెడ్డి,పవన్‌కుమార్, సబ్‌టెంపుల్స్ ఇన్‌చార్జి లక్ష్మయ్య, వర్క్ ఇన్సెపెక్టర్ బాలాజి, దేవాలయ అర్చకులు,గ్రామ పెద్దలు నీలకంఠారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త** ఏర్పేడుమండలం కొత్తవీరాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఓ కుటుంబాన్ని శనివారం మండల వైకాపా ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన మద్దూరు బండి శ్రీనివాసులు ఆనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కిషోర్‌రెడ్డి సమాచారాన్ని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన సూచనలతో కిషోర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేసారు.ఈ కార్యక్రమాల్లో రాందాస్, మునికృష్ణారెడ్డి, ప్రభుమునిరత్నం నాయుడు, వెంకటేశ్వర్లు వైకాపానాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వైసిపి పాలనలోనే దళితుల అభివృద్ధి

–నిజమైన దళిత ద్రోహి చంద్రబాబే –ఎస్వీయు పాలకమండలి సభ్యుడు మల్లారపు మధు



**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** దళితులు సామాజికంగా,ఆర్థికంగా,రాజకీయంగా ఇలా అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది కేవలం వైసిపి ప్రభుత్వంలోనేనని దళిత నేత,ఎస్వీయూ పాలకమండలి సభ్యుడు మల్లారపు మధు స్పష్టం చేశారు.శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ చరిత్రలో దేశంలోని ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి,సంక్షేమ పథకాలను అందిస్తూ ఆదర్శ సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచాడని కొనియాడారు.గత టిడిపి పాలనలో ఎస్సీ,ఎస్టీల పైన ఎన్నో దాడులు జరిగితే ఏనాడూ దానిని చంద్రబాబు ఖండించలేదని అన్నారు.దళితులుగా ఎవరైనా పుడతారా అని మమ్మల్ని అవమానం చేశాడు.ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ సబ్ ప్లాన్ బిల్లు వస్తే,దానిని బహిష్కరించిన ఘనత చంద్రబాబుదని,ఆయనే నిజమైన దళిత ద్రోహి అని మండిపడ్డారు. ఈ సమావేశంలో వైసిపి రాయలసీమ ఎస్సీ విభాగం కో–ఆర్డినేటర్ దేవదానం,చిత్తూరు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు వై.వెంకటస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి అరాచకాలకు అంతే లేకుండా పోతోంది

–టిడిపి వడ్డెర సాధికార సమితి

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైసిపి నాయకుల ఆగడాలు,అరాచకాలకు అంతే లేకుండా పోతోందని తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి తిరుపతి పార్లమెంట్ కన్వీనర్ కోనంగి శ్రీరాములు వారి చర్యలను తీవ్రంగా ఖండించారు.శనివారం వారి కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ నేటి ఉదయం కుప్పం నియోజకవర్గంలోని లక్ష్మీపురంలో వైసిపి కౌన్సిలర్ మణి కొందరు గౌండాలతో కలిసి టిడిపి నాయకుడు వడ్డే బాలకృష్ణను,అతని సోదరులపై దాడి చేసి గాయపరచడమే కాకుండా,ఇంటిలోని ఫర్నిచర్,అలాగే ద్విచక్రవాహనాన్ని దగ్ధం చేశారని మండిపడ్డారు.రాష్ట్రంలో వైసిపి గూండాలు వడ్డెర్లపై నిత్యం దాడులు చేస్తున్నారు.తాజాగా నెల్లూరు జిల్లా పొదలకూరు,సత్యసాయి జిల్లా నల్లమడ మండలంలోను ఇలా ఒక చోటు అనేది లేకుండా దాడులు చేస్తూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబ సభ్యులపై దాడి చేసిన కౌన్సిలర్ మణి,అతని అనుచరులపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని,లేని పక్షంలో తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి ఆధ్వర్యంలో మణి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వడ్డెర సాధికార సమితి నాయకులు టి.రమణ,మణిప్రసాద్,లక్ష్మీపతి, ప్రభు,తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** నేడు ఆదివారం స్థానిక జీవకోనలోని జీవలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం నందలి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నందు 330వ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త,అర్చకులు రాచగుండ్ల చంద్రశేఖర్ విశ్వకర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ ఆరాధనోత్సవాలలో భాగంగా ఉదయం 5 గంటలకు స్వామివారి అభిషేకాలంకరణ,మద్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన కార్యక్రమం,సాయంత్రం 4–30 నుండి రాత్రి 9 గంటల వరకు భూత భవిష్యత్ వర్తమాన కాలాల నుంచి కాలజ్ఞాన ప్రవచనాలు కడప జిల్లా వాస్తవ్యులైన కె.వీరశేఖరాచారిచే ప్రవచనాలు నిర్వహిస్తామన్నారు.ఈ ఆరాధనా మహోత్సవానికి భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో

జిల్లా స్థాయిలో క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

**నగరి, ఏప్రల్ 29 ప్రభాతవార్త:** రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు శాప్ క్రికెట్ కోచ్ బాబు క్రీడాకారుల ఎంపిక వివరాలు ఒక ప్రకటనలో తెలియజేశారు. నగరి డిగ్రీ కాలేజీ ఆవరణలో కేవీకే క్రీడా ప్రాంగణంలో అండర్–16, అండర్–19 విభాగాల్లో క్రికెట్(మేల్) క్రీడాకారుల ఎంపికను నేడు ఆదివారం నిర్వహించనున్నారు. 2007వ సంవత్సరం సెప్టెంబరు 1వ తేదీ నుంచి 2009 సెప్టెంబరు 1 లోపు పుట్టిన వారు అండర్–16 విభాగంలో, 2004వ సంవత్సరం సెప్టెంబరు 1 నుంచి 2007 సంవత్సరం సెప్టెంబరు 1 లోపు పుట్టిన వారు అండర్–19 విభాగంలో అర్హులని పేర్కొన్నారు. నగరిలో జరిగే క్రికెట్ క్రీడాకారులు ఎంపికలో పాల్గొనేవారు తెల్లని దుస్తులతో సొంత క్రీడా సామగ్రి తీసుకుని ఆధార్‌కార్డు, ఫారం 5, బర్త్ సర్టిఫికెట్ తీసుకురావాలని ఆయన కోరారు.

## నాడు-నేడు పనులు జూన్ 12 లోపు పూర్తి చేయాలి

**నగరి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** నాడు–నేడు పనులు జూన్ 12 లోపు పూర్తి చేయాలని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం విభాగం ఎస్ఈ పి.శంకర్‌బాబు అన్నారు. నగరి సబ్ డివిజన్ కార్యాలయంలో వివిధ పథకాల కింద మంజూరైన పనుల పురోగతిపై నగరి, నిండ్ర, విజయపురం ఏఈలు, డీఈతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరి, విజయపురం మండలంలో జరుగుతున్న నాడు–నేడు పనులను పర్యవేక్షించారు. నాడు–నేడు కింద మంజూరైన తాగునీరు, వంట గది, మేజర్, మైనర్ రిపేర్లు, టాయిలెట్ నిర్మాణం, పెయింటింగ్, విద్యుత్ మొదలైన వంటి ప్రాధాన్యత పనులను జూన్–12లోగా పూర్తి చేసి విద్యార్థులకు పాఠశాలను సౌకర్యవంతం చేయాలన్నారు. నాడు–నేడు పనుల కోసం ఖర్చు పెట్టే రివాల్వింగ్ ఫండ్ ఖర్చు చేసే కొద్దీ తిరిగి జమ అవుతుందన్నారు. నాడు–నేడు కింద మంజూరైన అన్ని పనులను ఎటువంటి నాణ్యత లోపం లేకుండా సకాలంలోపూర్తి చేయాలన్నారు. నగరి, నిండ్ర, విజయపురం మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరవుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలనిసూచించారు.కార్యక్రమంలో డీఈ ఎంఆర్ సతీష్‌కుమార్, ఏఈలు శైలేంద్ర, కె.వి.శ్రీకాంత్, కె.అంజేరయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 5 మండలాలకు చెందిన వైసీపీ నాయకులతో సమీక్ష



**నగరి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** నగరినియోజకవర్గ స్థాయిలో ఐదు మండలాలకు సంబంధించిన వైసీపీ పార్టీ ముఖ్య నాయకులతో జగనన్నే మా భవిష్యత్ కార్యాచరణకు నేటితో ముగింపు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి రోజా ఆదేశాలతో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై వచ్చిన ప్రజా మద్దతుపై మంత్రిసోదరుడు రాంప్రసాద్‌రెడ్డి పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో నగరి టాప్ 28 స్థానం సాధించడమే కాకుండా 65,000 మిసిడ్ కాల్ రావడం కార్యాచరణకు నాయకులు పడ్డ కష్టానికి ఫలితమన్నారు. రాంప్రసాద్‌రెడ్డి మనం మోసిన ఈ జెండా ఫలితం రెండు లక్షల మంది ఉద్యోగాలు కల్పించామని, మనం మోసిన జెండా నాలో లక్షలు మంది వలంటీర్లకు ఉపాధి కల్పించామని, 33 లక్షల మందికి ఇళ్ళ పట్టాలతో పాటు గృహాలు నిర్మించామని తెలిపారు. సచివాలయాలు ఆర్‌బీకేలు హెల్త్ సెంటర్‌లో ప్రజలకు చేరువుగా సేవలందిస్తున్నామన్నారు. వైసీపీ నాయకులు ప్రతి ఒక్క కుటుంబానికి సొంత కుటుంబ సభ్యులలాగాపరిచయంచేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు,చైర్మన్‌లు,ఎంపీపీలు,స్టేట్ బోర్డు డైరెక్టర్లు, వైస్ చైర్మన్‌లు, వైస్ ఎంపీపీలు, సచివాలయ కన్వీనర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## 29 వార్డుల్లోను సమానంగా అభివృద్ధి పనులు

మున్సిపల్ సమావేశంలో చైర్మన్ పీజీ నీలమేఘం

జగనన్న కాలనీ సమీపంలో ఉన్న టైర్ బర్నింగ్ ఫ్యాక్టరీని నిషేధించాలి – కౌన్సిలర్లు

**నగరి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** 29 వార్డుల్లోను సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్‌చైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. శనివారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయనసాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనఆ అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. అభ్యంతరాలు లేవని సభ్యులు అజెండాను ఆమోదించారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ అన్ని వార్డుల్లోను ప్రాధాన్యతా ప్రాతిపదికన సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఏవైనా ఇతర సమస్యలుంటే చెప్పాలన్నారు. దీనిపై కౌన్సిలర్ దయానిధి మాట్లాడుతూ కీళపట్టు శివారుల్లో ఉన్న టైర్ల బర్నింగ్ ఫ్యాక్టరీ కారణంగా కాలుష్యం అధికంగా వ్యాపిస్తోందన్నారు. సమీపంగా జగనన్న కాలనీ ఉందని 1267 నివాసాలు అక్కడ నిర్మిస్తున్నామని ఆ ప్రాంతంలో కలుషిత ఫ్యాక్టరీఉండకూడదని దానిని నిషేధించాలని కోరారు. ఇతర కౌన్సిలర్లు కూడా ఈ అంశంపై ఏకీభవించారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ అధికారులు ఆ ఫ్యాక్టరీని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో వైస్ చైర్మన్‌లు వెంకటరత్నం, బాలన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మేనేజర్ శేఖర్, టీపీవో నీరజాక్షి, మెప్మా అధికారి సునీత, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంగారి రమేష్‌కు గౌరవ డాక్టరేట్



**రేణిగుంట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్‌కు ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చి ఘనంగా సత్కరించింది. హోసూర్‌లో జరిగిన స్నాతకోత్సవంలో ఈ అవార్డును రమేష్ అందుకు న్నారు. అవార్డుతో పాటు షీల్డ్, పతకం ఇచ్చి గౌరవించారు. గత 20 సంవత్సరాలుగా ఆయన చేసిన సమాజసేవను గుర్తించి అవార్డు ఇచ్చింది. ఎన్నో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఎంతో మంది పేద విద్యార్థులకు చదువుకోవడానికి సహాయం అందించడం, కరోనా సమయంలో అశాగ్యులకు సేవ చేయడం, జీవాగ్రంలో వరదులు వచ్చినప్పుడు రాత్రి, పగలు కష్టపడి బాధితులకు పునరావాసం కల్పించడం, అతిసార వ్యాధితో బాధపడుతున్న అభాగ్యులకు వైద్య సేవలు అందించడాన్ని రహస్యంగా గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డు రావడానికి తల్లిదండ్రులు తన జీవిత భాగస్వామిప్రోత్సాహం ఎంతో ఉందని రమేష్ అన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సర్పంచ్‌ని చేశారని, పవిత్రరెడ్డి సాకారంతో పంచాయతీని అభివృద్ధిచేస్తానన్నారు. రమేష్‌ను ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, జువ్వల ధనంజయరెడ్డి అభినందించారు.

